సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ၊ 30 ၊ సెప్టెంబర్ ၊ 2023



చీనీ టన్ను రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 15 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం
35.1°/21.9°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

తుంగభద్రలో తగ్గిన నీటి నిల్వ



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయంలో శుక్రవారం నీటి నిల్వ 57.252 టీఎంసీలకు తగ్గింది. నెల రోజుల క్రితం 79 టీఎంసీల నీరు ఉండేది. జలాశయం ఎగువ భాగంలో వర్షాలు తగ్గడం, ఎండల కారణంగా నీటి చేరిక తగ్గిపోయింది. కాలువలకు నీటిని వదులుతుండడంతో జలాశయంలో మూడు రోజులకు 2 టీఎంసీల చొప్పున నీరు ఖాళీ అవుతోంది. డ్యాంలో శుక్రవారం ఇన్‌ఫ్లో 1,307 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 9,583 క్యూసెక్కులుగా నమోదైంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,520 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి 1633 అడుగులతో 105.788 టీఎంసీల నీరు నిల్వతో 12,427 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 11,813 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉండేది.

ట్రాక్టర్ నగర్‌లో 'క్లాస్ అకాడమీ' స్థాపన



'క్లాస్ అకాడమీ' స్థాపనకు ఒప్పందం చేసుకుంటున్న ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారీ నాందెడే

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ వ్యవసాయ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్) శిక్షణ విభాగం ఆధునీకరణలో భాగంగా వరికోత యంత్రాలు, వరి నాటే యంత్రాలను తయారు చేసే ప్రముఖ 'క్లాస్ అకాడమీ'ని స్థాపించనున్నారు. ఈ మేరకు ఒప్పందం కుదిరినట్లు ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారీ నాందెడే పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం 'క్లాస్ అకాడమీ' వారు ట్రాక్టర్ నగర్‌లో యంత్రాలను ఉంచి వాటిపై రైతులకు, టెక్నికల్ విద్యార్థులకు, కంపెనీ ఇంజినీర్లకు శిక్షణ ఇచ్చేవిధంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. అలాగే ట్రెనింగ్ విభాగంలో తగిన సౌకర్యాలు కల్పించి కంపెనీ యంత్రాలను ప్రదర్శనకు, శిక్షణ కోసం ఉపయోగించనున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ నగర్ సీనియర్ అగ్రికల్చరల్ ఇంజినీర్ కమలాబాయి, అగ్రికల్చరల్ ఇంజినీర్ నితీష్ వర్మ, సాంకేతిక నిపుణులు భాస్కర్, క్లాస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ మృత్యుంజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రికెట్ జట్టులో 'వీరా'కు చోటు



కోగటం హనీష్ వీరారెడ్డి

అనంతపురం: చండీగఢ్‌లో అక్టోబర్ 12 నుంచి జరగనున్న బీసీసీఐ అండర్-19 వినూ మన్కడ్ ట్రోఫీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోగటం హనీష్ వీరారెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. అనంతపురం నగరానికి చెందిన వీరారెడ్డి ఎడమ చేతి ఓపెనింగ్ బ్యాటర్. ఇటీవల కాలంలో అత్యుత్తమమైన ఆట తీరును ప్రదర్శించాడు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్-2లో మొత్తం 236 పరుగులు చేసి అత్యంత విలువైన ఆటగాడిగా గుర్తింపు దక్కించుకున్నాడు. అండర్-19 ఇంటర్ జోనల్ మ్యాచ్‌ల్లో సెంచరీ సాధించాడు. కేహెచ్ వీరారెడ్డి తన కోచ్ అయిన టీవీ చంద్రమోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో క్రికెట్ మెలకువలు నేర్చుకున్నాడు. తాజాగా జాతీయ స్థాయి టోర్నీకి ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

ఉచిత బీమాకు పంటల ఖరారు

అనంతపురం అగ్రికల్చర్: వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద పంటలు ఖరారు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం జీఓ ఎంఎస్ 52, 53 విడుదల చేసింది. ప్రస్తుత 2023- ఖరీఫ్‌కు 'అనంత'లో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాట పంటలకు వర్తింపజేశారు. ఫసల్ బీమా కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలను గుర్తించారు. మొత్తంగా 11 పంటలకు బీమా వర్తింపజేశారు.

- ఇక శ్రీ సత్యసాయి జిల్లాలో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాట పంటలను చేర్చారు. ఫసల్ బీమా కింద కంది, వరి, మొక్కజొన్న, ఆముదం, రాగి, పంటలను చేర్చారు. ఇక్కడ 10 పంటలకు బీమా ఇచ్చారు. వాతావరణ, ఫసల్ బీమా పథకాల మార్గదర్శకాలు, నిబంధనలు, రిస్క్ పీరియడ్స్, పంటకోత ప్రయోగాల నిర్వహణ తదితర సమగ్ర వివారలతో జీఓలు విడుదల చేశారు.

ఆరోగ్య సురక్ష.. అందరికీ రక్ష

- నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రారంభం
- 379 విలేజ్ క్లినిక్‌లు, 18 అర్బన్ హెల్త్‌సెంటర్ల పరిధిలో వైద్య శిబిరాలు
- స్పెషలిస్టు వైద్యులతో 53 రకాల పరీక్షలు, ఉచితంగా మందులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు

ప్రశాంతి నిలయం: ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే 'నాడు-నేడు' ద్వారా ఆస్పత్రులను అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంది. అలాగే 'ఫ్యామిలీ ఫిజీషియన్' ద్వారా గ్రామీణులకు ఇంటివద్దే వైద్యసేవలు అందిస్తోంది. తాజాగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారికి స్పెషలిస్టులతో స్థానికంగానే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తి కాగా, ఆరోగ్య సమస్యలున్న వారికి శనివారం నుంచి 45 రోజులు పాటు జరిగే వైద్య శిబిరాల్లో చికిత్స అందించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు.

సర్వేలో వివరాల సేకరణ..

జిల్లాలోని 32 మండలాల పరిధిలోని 379 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, 18 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఈనెల 15 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ముమ్మరంగా సాగింది. సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశా, తదితర వైద్య సిబ్బంది హైపర్‌టెన్షన్, హెచ్‌బీ, షుగర్, యూరిన్, మలేరియా, డెంగీ, గల్ల తదితర ఏడు రకాల పరీక్షలు నిర్వహించి, అరోగ్య సమస్యలున్న వారిని గుర్తించారు. వీరికి సురక్ష శిబిరంలో స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు చేయించి వైద్యం అందించేందుకు వీలుగా టోకెన్లు సైతం అందజేశారు. అలాగే వారి ఆరోగ్య వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన కేస్ షీట్లలో పొందుపరిచారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వీరు టోకెన్ చూపించి వైద్య సేవలు పొందవచ్చు.

215 మంది వైద్యుల నియామకం..

వైద్య శిబిరాలకు వచ్చే వారిని స్క్రీనింగ్ చేయడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆర్థో, కార్డియాక్, యూరాలజీ, ఆప్తమాలజీ, గైనకాలజీ వంటి రంగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులను వివిధ ప్రాంతాల నుంచి రప్పిస్తున్నారు. ఈక్రమంలో కర్నూలు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన 32 మంది, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌కు చెందిన 38 మంది, ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన 60 మంది, ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన 21 మంది స్పెషలిస్ట్ వైద్యులు, జిల్లాలోని పీహెచ్‌సీల్లోని 64 మంది వైద్యులు ఇలా మొత్తంగా శిబిరాల నిర్వహణకు 215 మంది వైద్యులను నియమించారు. వీరందరూ షెడ్యూల్ మేరకు జిల్లాలోని నిర్వహించే వైద్య శిబిరాలలో పాల్గొని వైద్య సేవలు అందివ్వనున్నారు. ప్రతి బృందంలోనూ జనరల్ మెడిసిన్, స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్, మరో ఇద్దరు సివిల్ సర్జన్లు ఉంటారు. వైద్య శిబిరాలలో అవసరమైన వారికి 53 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

వైద్య శిబిరాలు నిర్వహించేది ఇక్కడే..

జిల్లాలోని రూరల్, అర్బన్ కలిపి 32 ప్రాంతాల్లో శనివారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. పీహెచ్‌సీల పరిధిలో ఉన్న అగళి, అమడగూరు మండలం తుమ్మల, అమరాపురం మండలం తమ్మడేపల్లి-1, బత్తలపల్లి మండలం అప్రాచెరువు, బుక్కపట్నం మండలం మారాల, చెన్నేకొత్తపల్లి మండలం చెన్నేకొత్తపల్లి-1, చిలమత్తూరు మండలం వీరాపురం, ధర్మవరం మండలం కుణుతూరు, గాండ్లపెంట మండలం కటారుపల్లి, గోరంట్ల మండలం కొండాపురం, గుడిబండ మండలం కుమ్మరనాగేపల్లి(చిగతుర్పి), హిందూపురం మండలం కొటిపి, కనగానపల్లి మండలం ఏలకుంట్ల, కొత్తచెరువు మండలం బండ్లపల్లి, లేపాక్షి మండలం చోళసముద్రం, ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లి తండా, నల్లచెరువు మండలం కదిరిపూలకుంట, నల్లమాడ మండలం చారుపల్లి, ఎన్‌పీకుంట మండలం గౌకనపల్లి, ఓడీసీ మండలం కొండకమర్ల-1, పరిగి మండలం పరిగి-2, పెనుకొండ మండలం మునిమడుగు, రామగిరి మండలం కుంటిమద్ది, రొద్దం మండలం రొద్దం-3, రొళ్ల మండలం రత్నగిరి, సోమందేపల్లి మండలం సోమందేపల్లి-2, తాడిమర్రి మండలం పిన్నదరి, తలుపుల మండలం వేపమానిపేట, తనకల్లు మండలం తనకల్లు -1లోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ పరిధిలో హిందూపురం ముద్దిరెడ్డిపల్లి, కదిరి మూర్తిపల్లి, మడకశిర యూపీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వైద్య శిబిరాల్లో 53 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తాం. మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని ఆస్పత్రికి తరలించి వైద్య అందిస్తాం. శస్త్రచికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పంపుతాం. శస్త్ర చికిత్స తర్వాత రోగి పూర్తిగా కోలుకునే వారు ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ఇంటి వద్దకే వచ్చి వైద్యుడు సేవలు అందించేలా చూస్తాం. – డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

'సురక్ష'కు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం అమలు చేస్తోందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న సురక్ష వైద్య శిబిరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాలన్నారు. శిబిరాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డెంగీ నిర్ధారణ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలన్నారు. వైద్య సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలన్నారు. వైద్య శిబిరాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. జిల్లాకు వర్ష సూచన ఉన్నందున వైద్య శిబిరాలు ఆరుబయట నిర్వహించవద్దన్నారు. శిబిరాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. యాప్ డౌన్‌లోడ్ అయిన తర్వాత లాగిన్ అయిందో లేదో చెక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

17 మండలాల్లో వర్షం



పెడబల్లి సమీపంలో కాజ్‌వేపై పారుతున్న చిత్రావతి

పుట్టపర్తి అర్బన్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చిత్రావతి నది పరవళ్లు తొక్కుతోంది. శుక్రవారం పెడబల్లి సమీపంలో కాజ్‌వే పైనుంచి పారింది. ఇక గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలోని 17 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా ఎన్‌పీకుంట మండలంలో 60.4 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. ఇక చిలమత్తూరు 41.6, గోరంట్ల 18.2, సోమందేపల్లి 17 , రొద్దం 16.2, తనకల్లు 13.6, లేపాక్షి 12.4, తాడిమర్రి 11.2, ముదిగుబ్బ 6.2, రొళ్ల 5.4, నల్లచెరువు 5.2, అమడగూరు 4.6, గాండ్లపెంట 3.4, కదిరి 3, పెనుకొండ 2.2, తలుపుల 1.8, బత్తలపల్లి 1.2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. కాగా, రాగల రెండు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్

- ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖ అధికారులతో రోడ్డు సేఫ్టీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు, భవిష్యత్‌లో అనుసరించాల్సిన పద్ధతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్ మాట్లాడుతూ.. 9 నెలల కాలంలో జిల్లాలో 357 ప్రమాదాలు చోటుచేసుకోగా, 100 మంది మృతి చెందారన్నారు. మరో 257 మంది గాయపడ్డారన్నారు. జిల్లాలో 25 బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాలు జరుగుతున్నట్లు రవాణా శాఖ అధికారులు గుర్తించారన్నారు. ఆయా ప్రాంతాల్లో భద్రతా పరంగా మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల మరమ్మతులపై ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్ శాఖలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ధర్మవరం టీవీఎస్ షోరూం వద్ద రోడ్డు మరమ్మత్తులు చేయించేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 142 రోడ్ల మరమ్మత్తు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. వాటిలో 29 పనులు పూర్తయ్యాయన్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని గోల్డెన్ హవర్‌లో ఆస్పత్రులకు చేర్పిన వారికి కేంద్రం 'గుడ్ సమారిటన్ స్కీం' కింద రూ.5 వేల ప్రోత్సాహం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, జిల్లా రవాణా శాఖ అధికారి కరుణసాగర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఎంవీఐలు వరప్రసాద్, శివశంకర్, రాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 'కొత్త' జోష్

- పార్టీ మండల నూతన అధ్యక్షుల నియామకం
- 37 మందితో జాబితా విడుదల
- బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం

సాక్షి, పుట్టపర్తి

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షులను నియమించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మండల అధ్యక్షుల నియామకంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారు. జిల్లాలో మడకశిర, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో మండల కమిటీలను 36 మందితో పూర్తి చేశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం అప్పజెప్పిన బాధ్యతలకు న్యాయం చేస్తామన్నారు. తమ ఎంపికకు కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అసెంబ్లీ నియోజకవరాల వారీగా మండల అధ్యక్షుల వివరాలు ఇలా..

మడకశిర: పట్టణ అధ్యక్షుడిగా పుట్టకామప్ప, మడకశిర మండల అధ్యక్షుడిగా రామిరెడ్డి, అగళి అధ్యక్షుడిగా స్టూడియో శ్రీనివాస్, అమరాపురం అధ్యక్షుడిగా జి.త్రిలోక్‌నాథ్, గుడిబండ అధ్యక్షుడిగా డీఎల్ యంజారెగౌడ్, రొళ్ల మండల అధ్యక్షుడిగా కె.నరసింహారెడ్డి నియమితులయ్యారు.



- హిందూపురం: పట్టణ 1వ కన్వీనర్‌గా సీఎం సాధిక్ (1, 2, 10, 17, 18, 19, 20, 21, 22, 23, 25, 26, 32, 33, 34, 35, 36, 37, 38 వార్డులు), 2వ కన్వీనర్‌గా బెల్లం నరేశ్ (3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, 24, 27, 29, 30, 31 వార్డులు), హిందూపురం మండల అధ్యక్షుడిగా రాము, లేపాక్షి అధ్యక్షుడిగా నారాయణస్వామి, చిలమత్తూరు మండల అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డిని నియమించారు.
- పెనుకొండ: పట్టణ అధ్యక్షుడిగా ఎస్.నరసింహులు, పెనుకొండ మండల అధ్యక్షుడిగా ఎస్వీ జయప్రకాశ్‌రెడ్డి, గోరంట్ల అధ్యక్షుడిగా లక్ష్మీనరసప్ప, పరిగి అధ్యక్షుడిగా బీకే నరసింహమూర్తి, రొద్దం అధ్యక్షుడిగా బోయ తిమ్మయ్య, సోమందేపల్లి మండల అధ్యక్షుడిగా బీఎస్ నారాయణరెడ్డికి అవకాశం లభించింది.
- పుట్టపర్తి: పట్టణ అధ్యక్షుడిగా రంగారెడ్డి, పుట్టపర్తి మండల అధ్యక్షుడిగా నరసారెడ్డి, అమడగూరు అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, బుక్కపట్నం అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి, కొత్తచెరువు అధ్యక్షుడిగా నారేపల్లి జగన్, నల్లమాడ అధ్యక్షుడిగా సూర్యనారాయణ, ఓబుళదేవరచెరువు మండల అధ్యక్షుడిగా ఏకిల రాజు నియమితులయ్యారు.
- ధర్మవరం: పట్టణం క్లస్టర్-1 అధ్యక్షుడిగా నీలూరి ప్రకాశ్, ధర్మవరం మండల అధ్యక్షుడిగా రామయ్య, బత్తలపల్లి అధ్యక్షుడిగా జయరామిరెడ్డి, ముదిగుబ్బ అధ్యక్షుడిగా సీవీ నారాయణరెడ్డి, తాడిమర్రి మండల అధ్యక్షుడిగా ఎ.రామాంజనేయులును నియమించారు.
- కదిరి: పట్టణ అధ్యక్షుడిగా షేక్ జిలాన్, కదిరి మండల అధ్యక్షుడిగా కె.ప్రకాశ్, గాండ్లపెంట అధ్యక్షుడిగా గజ్జల రవీంద్రారెడ్డి, నల్లచెరువు అధ్యక్షుడిగా ఎస్.హైదర్‌వలి, ఎన్‌పీకుంట అధ్యక్షుడిగా రంగారెడ్డి, తలుపుల అధ్యక్షుడిగా ఫయాజ్, తనకల్లు మండల అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డికి అవకాశం లభించింది.

పలువురు ఎస్ఐల బదిలీ



పుట్టపర్తి టౌన్: జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేయడంతో పాటు ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశాలతో ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కంబదూరులో ఉన్న ఎం.రాజేష్‌ను పెనుకొండకు, కుందుర్పిలో ఉన్న కృష్ణమూర్తిని పుట్టపర్తి రూరల్ స్టేషన్‌కు, అనంతపురం ట్రాఫిక్ ఎస్ఐగా ఉన్న వంశీకృష్ణను ముదిగుబ్బకు, అనంతపురం నాల్గోపట్టణ స్టేషన్‌లో పనిచేస్తున్న గంగాధర్‌ను చిలమత్తూరుకు, అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులును బత్తలపల్లికి బదిలీ చేశారు. అలాగే వీఆర్(అనంతపురం)లో ఉన్న రాజశేఖర్‌ను తనకల్లుకు, వీఆర్(శ్రీసత్యసాయి)లో ఉన్న కేఎం లింగన్నను నల్లచెరువుకు, వరలక్ష్మీదేవిని నల్లచెరువు, కల్లూరు గోపిని ఓడీచెరువుకు, డి.లక్ష్మీనారాయణను గోరంట్లకు, బాలరామయ్యను అమడగూరు బదిలీ చేశారు. గాండ్లపెంటలో ఉన్న మల్లిఖార్జునరెడ్డిని ఓడీచెరువుకు, అమడుగూరులోని వెంకటనారాయణను గాండ్లపెంటకు, పుట్టపర్తి అర్బన్ స్టేషన్‌లో ఉన్న వెంకటరమణను సెక్యూరిటీ వింగ్‌కు, నల్లమాడలో ఉన్న వలీబాషాను రొద్దం స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- డ్రైవర్లను ఆదుకునేందుకే 'వాహన మిత్ర'
- ప్రభుత్వ ఆర్థికసాయంతో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు
- మెగాచెక్కు పంపిణీలో కలెక్టర్ అరుణ్‌బాబు
- ఐదో విడతలో జిల్లాలోని 5,664 మందికి రూ.5.66 కోట్లు జమ



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సహకారంతో ఆటో, మ్యాక్సీ క్యాబ్, ఎండీయూ వాహన డ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడ విద్యాధరపురం బహిరంగ సభలో కంప్యూటర్ బటన్ నొక్కి 'వైఎస్సార్ వాహన మిత్ర' ఐదో విడత నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, 'పుడా' చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి కరుణసాగర్‌రెడ్డి తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం జిల్లాలోని 5,664 మంది ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్, ఎండీయూ వాహన డ్రైవర్లకు 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకం కింద రూ.5.66 కోట్లకు సంబంధించిన మెగా చెక్కు అందజేశారు.

డ్రైవర్లకు క్రమశిక్షణ ముఖ్యం..

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ... ఆటో, మ్యాక్సీ, ఎండీయూ వాహన డ్రైవర్లను 'వైఎస్సార్ వాహన మిత్ర' పథకం ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. ఈ నిధులను వాహన మరమ్మతు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, టైర్ల కొనుగోలుకు ఉపయోగించుకోవాలని సూచించారు. వాహన డ్రైవర్లు క్రమశిక్షణ కలిగి ఉండాలని, డ్రైవింగ్ సమయంలో మీరు తీసుకునే నిర్ణయాలపై మీతో పాటు ప్రయాణికులు ప్రాణాలూ ఆధార పడి ఉంటాయని గుర్తించాలన్నారు. అందువల్ల క్రమశిక్షణ, ఓర్పు ఉండాలన్నారు. వాహనమిత్ర అమలు తర్వాత చాలా మంది నూతన వాహనాలు కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు క్రమం తప్పకుండా అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాహనమిత్ర ద్వారా ఒక్కో లబ్ధిదారునికి ఏడాదికి రూ.10 వేల చొప్పున ఈ ఐదేళ్లలో రూ.50 వేలు అందజేయడం చాలా గొప్పవిషయమన్నారు. అనంతరం రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కదిరి, హిందూపురం, పెనుకొండ ఎంవీఐలు వరప్రసాద్, శివశంకర్, రవీంద్రనాయక్, రాణి, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గర్వంగా బతుకుతున్నా



'వైఎస్సార్ వాహన మిత్ర' పథకంలో భాగంగా ఏడాదికి రూ.10 వేల చొప్పున ఐదేళ్లుగా నాకు రూ.50 వేలు అందాయి. దీంతో ఎఫ్‌సీ, ఇన్సూరెన్స్ సకాలంలో చేయించుకుంటున్నా. ఇప్పుడు అధికారులు పట్టుకుంటారన్న భయం లేదు. గర్వంగా బతుకుతున్నా. – భాస్కర్, పుట్టపర్తి

'వాహన మిత్ర' ఆదుకుంటోంది



నేను ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. కరోనా కష్టకాలంలో 'వాహన మిత్ర' పథకం నా కుటుంబాన్ని ఆదుకుంది. మాలాంటి వారిని ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా. – వాల్మీకి రత్నమ్మ, హిందూపురం

క్లుప్తంగా

నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు



రాయచూర్ పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: పటిష్టమైన భద్రతా చర్యలు పాటిస్తూ నేర నియంత్రణకు కృషి చేస్తున్నట్లు గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం గుంతకల్ రైల్వే జీఆర్‌పీ జిల్లా పరిధిలోని కర్ణాటకలోని రాయచూర్ జీఆర్‌పీ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైలు ప్రయాణికుల భద్రత, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించారు. సమస్యాత్మక రైలు మార్గాలు, రైల్వేస్టేషన్లపై ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలన్నారు. రాయచూర్ జీఆర్‌పీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి పురోగతి తదితర అంశాలపై చర్చించారు. గుంతకల్లు జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఐపీఎఫ్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాల ఢీ

- నలుగురికి గాయాలు



నుజ్జు నుజ్జు అయిన వాహనం

తలుపుల: మండలంలోని బట్రేపల్లి సమీపంలోని వాటర్‌ఫాల్స్ సమీపంలో శుక్రవారం రాత్రి టాటా ఏస్(చోటా) వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు.. తలుపుల మండలం ఎర్రసానిపల్లికి చెందిన లక్ష్మిరెడ్డి తన టాటాఏసీ వాహనంలో కదిరికి వెళ్తున్నారు. అయితే వాటర్ ఫాల్స్‌కు సమీపంలోని అడవి చెరువు మలుపు వద్ద అటుగా వచ్చిన కారు వేగంగా టాటా ఏస్ వాహనాన్ని ఢీ కొంది. ఈ ఘటనలో టాటాఏస్ వాహన డ్రైవర్ లక్ష్మీరెడ్డి తీవ్రంగా గాయపడగా అతన్ని అనంతపురం తరలించారు. కదిరిలోని వలిసాబ్ రోడ్డుకు చెందిన ముగ్గురు యువకులు గాయపడటంతో వారిని కదిరికి తరలించారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్





వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం ఎస్పీ అన్బురాజన్, దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

- 30 ద్విచక్రవాహనాల స్వాధీనం

అనంతపురం క్రైం: ఒకే కంపెనీకి చెందిన ద్విచక్రవాహనాలను అపహరించే ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అనంతపురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వీరి నుంచి ఒకే కంపెనీకి చెందిన 30 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మీడియాకు వెల్లడించారు. గార్లదిన్నె మండలం సంజీవపురానికి చెందిన శంకరసాయికుమార్, ఓబన్న, పామిడి మండల కేంద్రంలో నివాసముంటున్న షేక్ మదార్‌వలి కూలీలు. ఈ ముగ్గురూ చెడు వ్యసనాలకు బానిసయ్యారు. వ్యసనాలు తీర్చుకోవడానికి కూలి డబ్బు చాలకపోవడంతో ద్విచక్రవాహనాల చోరీని ఎంచుకున్నారు.

ఒకే కంపెనీ వాహనాలే టార్గెట్..

ముఠాగా ఏర్పడిన శంకరసాయికుమార్, ఓబన్న, మదార్‌వలి ఒకే కంపెనీకి చెందిన ద్విచక్రవాహనాలనే టార్గెట్ చేయాలని నిర్ణయించారు. ద్విచక్రవాహనాల గురించి బాగా అనుభవం ఉన్న మదార్‌వలి ఇందులో కీలకంగా వ్యవహరించారు. ఒకే కంపెనీ చెందిన తాళం చెవితో అదే మోడల్ల బైక్‌లను సులభంగా స్టార్ట్ చేయవచ్చని.. అదే ఫార్ములాతో ముగ్గురూ కలిసి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటకలోని బెంగళూరు, బళ్లారి, సిరిగుప్ప, కర్నూలు, బనగానపల్లి, డోన్, నంద్యాల, ఎన్ఎస్‌గేటు, శింగనమల, తాడిపత్రి ప్రాంతాల్లో ఆర్టీసీ బస్టాండ్, ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించారు. దొంగిలించిన వాహనాలను అనంతపురం శివారు 44వ జాతీయ రహదారి నేషనల్‌పార్కు సమీపంలో ఉన్న పాడుబడిన షెడ్డులో దాచారు.

ఎస్పీ ఆదేశాలతో ముఠా కదలికలపై నిఘా..

అనంతపురం నగరంలో కొంతకాలంగా ద్విచక్రవాహనాల చోరీకి గురవడాన్ని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సీరియస్‌గా తీసుకున్నారు. దొంగలను గుర్తించాలని ఆదేశాలు జారీ చేయడంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఏడాది కాలంగా కొంత మంది యువకులు పాడుబడ్డ గోదాములో చాలా దిచక్ర వాహనాలను ఉంచినట్లు సమాచారం అందింది. శుక్రవారం డీఎస్పీలు వై. శివారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, త్రీటౌన్ సీఐ ధరణికిషోర్, సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, ఎస్ఐలు నబీరసూల్, నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీదర్, శ్రీనివాసులు, తిరుమలేష్, శ్రీధర్‌ఫణి, సిబ్బంది ప్రభు, ఆనంద్, శ్రీనివాసులు, రమణ, స్వరూప్, ప్రవీణ్‌లు దాడి చేసి గోదాములో ఉంచిన రూ.18.60 లక్షలు విలువ చేసే 30 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బైక్ దొంగలు శంకరసాయికుమార్, ఓబన్న, మదార్‌వలిని అరెస్ట్ చేశారు. ఈ ముఠాను పట్టుకోవడంలో నైపుణ్యం ప్రదర్శించిన పోలీసు అధికారులతో పాటు సిబ్బందిపై ఎస్పీ ప్రశంసలు కురిపించారు.

వాహనదారులూ తస్మాత్ జాగ్రత్త!

వాహనదారులు తమ ద్విచక్రవాహనాలకు పటిష్టమైన లాక్‌సిస్టం ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. ఇళ్ల ముందు పార్కింగ్ చేసుకునే వారు కూడా ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని వాహనాలను భద్రపరుచుకోవాలన్నారు. రాత్రి వేళ ఎవరైనా అనుమానితులు సంచరిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. అప్రమత్తంగా లేకపోతే విలువైన వస్తువులను కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

జేఎన్‌టీయూ(ఏ)కు అరుదైన గుర్తింపు

- ప్రపంచస్థాయి ర్యాంకింగ్‌లో చోటు



జేఎన్‌టీయూ అనంతపురం పాలకభవనం

అనంతపురం: ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్–2024లో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం- అనంతపురం (జేఎన్‌టీయూ (ఏ))కు చోటు దక్కింది. లండన్‌లోని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ గురువారం ప్రపంచ యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2024ను ప్రకటించింది. భారతదేశంలో 91 సంస్థలు ర్యాంకులు దక్కించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏడు యూనివర్సిటీలకు ర్యాంకులు రాగా అందులో జేఎన్‌టీయూ(ఏ) ముందుస్థానంలో ఉంది. అంతర్జాతీయ స్థాయిలో 801–1000 ర్యాంకు, జాతీయస్థాయిలో 34వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో తొలి ర్యాంకు సాధించింది.

ఇదీ ర్యాంకులకు కొలమానం..

టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థ యూనివర్సిటీల ర్యాంకును ప్రకటించేందుకు 134 సైటేషన్లు, 1.65 కోట్ల రీసెర్చ్ పబ్లికేషన్లను పరిశీలించింది. అంతర్జాతీయంగా 2,673 విద్యా సంస్థల్లో 86,402 మంది పరిశోధన విద్యార్థులకు సంబంధించిన రీసెర్చ్ పబ్లికేషన్లు పరిశీలన చేశారు. ఇందులో జేఎన్‌టీయూ (ఏ)కు బోధనా నైపుణ్యంలో 28.9 పాయింట్లు, పరిశోధనలో 14.1 పాయింట్లు, పరిశోధన నాణ్యతలో 60.7 పాయింట్లు, పరిశ్రమల్లో ఉపాధికి సంబంధించి 17.5 పాయింట్లు, అంతర్జాతీయ అవుట్‌లుక్‌లో 19.6 పాయింట్లు దక్కాయి. ఫుల్‌టైం ఈక్వెలెంట్ స్టూడెంట్స్(ఎఫ్‌టీఈ), విద్యార్థి–అధ్యాపకుల నిష్పత్తి, పురుష–మహిళా విద్యార్థుల నిష్పత్తి ఆధారంగా ర్యాంకులు ప్రకటించారు. జేఎన్‌టీయూ అనంతపురంలో మొత్తం 6,175 మంది విద్యార్థులు రెగ్యులర్ కోర్సులు చదువుతుండగా, ప్రతి 18 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు బోధిస్తున్నారు. 41 మంది అమ్మాయిలు, 59 మంది అబ్బాయిలు చదువుతున్నారు.

గర్వకారణం



జేఎన్‌టీయూ(ఏ)కు అంతర్జాతీయ స్థాయి ర్యాంకు రావడం గర్వకారణం. రాష్ట్రంలో ఈ ర్యాంకులు దక్కించుకున్న ఏడు విద్యా సంస్థల్లో జేఎన్‌టీయూ అనంతపురం తొలి స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది. న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లాం. త్వరలోనే న్యాక్ గుర్తింపుకు సంబంధించిన పీర్ కమిటీ పర్యటించనుంది. న్యాక్‌లోనూ మంచి గ్రేడింగ్ వస్తుందన్న ఆశాభావంతో ఉన్నాం.
– జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూఏ

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్

హిందూపురం టౌన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో కలిసి పోలింగ్ కేంద్రాల మార్పుపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ జేసీ మాట్లాడుతూ ఫారం–6 ద్వారా 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. అలాగే మరణించిన వారి పేర్లను ఓటరు జాబితాలో తొలగించడం కోసం ఫారం–7ను కుటుంబీకులు డెట్ సర్టిఫికెట్‌తో పాటు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఓటర్ కార్డులో మార్పులు, చేర్పులు ఉంటే ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లెయిమ్ అండ్ అబ్జెక్షన్స్‌ను తొందరగా ఫీల్డ్ ఎంక్వైరీ చేసి ఆన్‌లైన్ అప్లికేషన్ లాగిన్‌లో క్లియర్ చేయాలని ఎన్నికల సిబ్బందికి ఆదేశించారు. హిందూపురం నియోజకవర్గంలో 18 పోలింగ్ కేంద్రాల ప్రదేశాలను మార్పు చేస్తున్నామని, హిందూపురం రూరల్‌లో 1, అర్బన్‌లో 13, లేపాక్షి, చిలమత్తూరులో రెండు ఉన్నాయన్నారు. దీంతో పాటు 16 పోలింగ్ కేంద్రాల పేర్లు మారుస్తున్నామని, హిందూపురం రూరల్‌లో 2, చిలమత్తూరులో 14 కేంద్రాలు ఉన్నాయని, వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఆమోదించారని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరేంద్ర, సెరికల్చర్ ఏడీ సురేష్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, లేపాక్షి, చిలమత్తూరు తహసీల్దార్లు బాబు, నాగరాజు, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - యువకుడి మృతి



మృతుడు సైపుల్లా

పెనుకొండ: ఆటో బోల్తాపడి సైపుల్లా (31) అనే యువకుడు మరణించాడు. ఎస్‌హెచ్‌ఓ రమేష్ వివరాలమేరకు... పట్టణానికి చెందిన మృతుడు సైపుల్లా గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పెనుకొండ కొండ రోడ్డులో ఉన్న తన తోట వద్దకు ఆటోలో బయలుదేరాడు. అయితే పెనుకొండ కొండకు వెళ్లే రహదారిలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సైపుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే సైపుల్లా మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి



వెంకటేష్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి చెందిన సంఘటన ధర్మవరం పట్టణంలో శుక్రవారం జరిగింది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన పెయింటర్ వెంకటేష్ (50) నూతన భవనాలకు పెయింటింగ్ వేస్తూ జీవించేవాడు. శుక్రవారం ఉదయం రాజేంద్రనగర్‌లో నూతన ఇంటికి రంగులు వేస్తుండగా పైనున్న విద్యుత్ వైర్లను గమనించకపోవడంతో పెయింటింగ్ వేసే పైపు విద్యుత్ వైర్లకు తగిలి విద్యుదాఘానికి గురయ్యాడు. తోటి పెయింటర్లు వెంకటేష్‌ను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య 20 ఏళ్ల క్రితమే వదిలేసినట్లు బంధువులు తెలిపారు. మృతుడు తల్లి వెంకటమ్మ వద్ద ఉంటున్నట్లు పేర్కొన్నారు. తెలిపారు. వెంకటేష్ మృతి వార్తతో ఆయన తల్లి, అక్క బోరున విలపించారు. దీంతో దుర్గానగర్‌లో విషాద ఛాయలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాకీ టోర్నీ విజేత ధర్మవరం



ఆర్డీటీ ధర్మవరం డెవలప్‌మెంట్ సెంటర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: హాకీ క్రీడతో అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని నెదర్లాండ్ దేశానికి చెందిన హాకీ క్రీడాకారుడు బెంజమాన్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో శుక్రవారం అండర్–10 మిక్స్‌డ్ జండర్ ఫస్ట్ ఫేస్ రీజనల్ హాకీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీలో ఆర్డీటీ ధర్మవరం డెవలప్‌మెంట్ సెంటర్ టీం, గొట్లూరు హాకీ క్లబ్ టీం, పుట్టపర్తి హాకీ క్లబ్ టీం, కుంటిమద్ది హాకీ క్లబ్ టీంలు పోటీపడ్డాయి. రౌండ్ రాబిన్ పద్ధతి ప్రకారం మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్డీటీ ధర్మవరం డెవలప్‌మెంట్ సెంటర్ టీం విన్నర్స్‌గా నిలవగా గొట్లూరు హాకీ క్లబ్ టీం రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారుడు బెంజమాన్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, ఆర్డీటీ డెవలప్‌మెంట్ సెంటర్ కోఆర్డినేటర్ ఓబులేసు, రీజనల్ హాకీ కోచ్ అనిల్‌కుమార్ విజేతలకు ట్రోఫీలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాకీలో ప్రతి క్రీడాకారులు ప్రతిభ చూపుతూ ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. అప్పుడే అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీలు ఓబులేసు, అశ్విని, సీనియర్ హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ మ్యాచ్‌లు



తలపడుతున్న ఢిల్లీ-డెహ్రాడూన్ జట్లు

అనంతపురం: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన మ్యాచుల వివరాలు. ఛండీఘడ్- రాజస్థాన్ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛండీఘడ్ 7, రాజస్థాన్ 2 గోల్స్ సాధించడంతో ఛండీఘడ్ విజయం సాధించింది. ఢిల్లీ- దాద్రా నగర్‌హవేలీ, డామన్, డయ్యూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 16 గోల్స్ సాధించి ఘన విజయం సాధించింది. జమ్మూకశ్మీర్- తెలంగాణ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో జమ్మూ కాశ్మీర్ మూడు గోల్స్ సాధించింది. తెలంగాణ ఒక గోల్స్ కూడా సాధించకపోవడంతో జమ్మూకాశ్మీర్ విజయం సాధించింది. మధ్యప్రదేశ్- పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో మధ్యప్రదేశ్ 7 గోల్స్ చేయగా, పాండిచ్చేరి ఒక గోల్ కూడా చేయలేదు. మధ్యప్రదేశ్ ఏకపక్షంగా విజయాన్ని కైవసం చేసుకుంది.

పాముకాటుతో మహిళ మృతి



మృతురాలు ఆదినారాయణమ్మ

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబుళంపల్లిలో ఓ మహిళ పాముకాటుతో మృతి చెందింది. గ్రామస్తుల వివరాలమేరకు... ఓబుళంపల్లికి చెందిన మైలారపు హనుమంతరెడ్డి భార్య మైలారపు ఆదినారాయణమ్మ (47) పశుగ్రాసం కోసం శుక్రవారం పొలంలోకి వెళ్లగా అక్కడ పాము కాటుకు గురైంది. వెంటనే స్థానికులు పుట్టపర్తి సత్యసాయి ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి సానుభూతి తెలిపారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

- నేర సమీక్షలో ఎస్పీ మాధవరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని వివిధ స్టేషన్‌ల పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సాక్ష్యాధారాల సేకరణ, వాటిని కోర్టులో ప్రవేశపెట్టడంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అంతిమంగా నేరం చేసిన వారికి శిక్ష పడేలా చూడాలన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులపై సమీక్షించి అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... కేసుల దర్యాప్తులో సాంకేతిక వినియోగం పెరగాలన్నారు. నేర నియంత్రణ, కేసుల ఛేదనతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హత్య, ప్రాపర్టీ, అనుమానాస్పద మృతులు, సైబర్ నేరాలు, గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి త్వరగా కోర్టులో చార్జిషీట్ వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా వాహనాలు పార్కింగ్ స్థలంలోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలపై నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. చోరీలు, దోపిడీలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. అలాగే రాత్రివేళల్లో పెట్రోలింగ్, బీట్ల సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మెలగాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తీరుస్తూ శాఖపై నమ్మకం కలిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, పోలీసు న్యాయ సలహాదారు సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



ఓబులేసు మృతదేహం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

బత్తలపల్లి: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు (55) శుక్రవారం మృతి చెందాడు. బత్తలపల్లి పోలీసుల వివరాలమేరకు.. బత్తలపల్లి పోలీస్‌స్టేషన్‌లో మూడున్నర సంవత్సరాలుగా హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న బి.ఓబిలేసు కొద్ది నెలల క్రితం పక్షవాతం బారిన పడ్డారు. దీంతో సెలవు పెట్టి చికిత్స పొందుతున్న సమయంలో నెల రోజుల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇందులో భాగంగానే కర్నూలు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు సమాచారం అందించారన్నారు. విషయం తెలిసిన వెంటనే ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, యూనియన్ నాయకులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి అనంతపురం తరలివెళ్లి ఓబులేసు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురంలోని క్రిస్టియన్ పెరేడ్ గ్రౌండ్లో శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ప్రభుత్వ తక్షణ సాయంగా మృతుని కుటుంబ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఓబులేసు మృతికి ఎస్పీ మాధవరెడ్డి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగేష్

బత్తలపల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని మరో ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని జ్వాలాపురం క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు నగేష్ కియాలో పనిచేసేవాడు. ప్రస్తుతం పని వదిలేసి ఇంటి వద్ద ఉంటున్నాడు. ముదిగుబ్బ మండలం మర్తాడుకు చెందిన ఆదినారాయణ కుమార్తె మౌనికతో వివాహం జరిగింది. ప్రస్తుతం మౌనిక గర్భిణీ. ఆమె మర్తాడులో ఉండటంతో ఆమె వద్దకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. తిరిగి శుక్రవారం ధర్మవరంకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా బత్తలపల్లి మండలం జ్వాలాపురం క్రాస్ వద్దకు రాగానే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తలకు హెల్మెట్ ధరించి నగేష్ వాహనాన్ని ఆపారు. ఇంతలో కత్తితో నగేష్‌పై దాడి చేయగా తప్పించుకున్నాడు. వెంట పడి కట్టెలతో దాడి చేశారు. అయినా వారికి అందకుండా సమీపంలో పొలం పనులు చేసుకుంటున్న వారి వద్దకు వెళ్లి విషయం చెప్పారు. రైతులు వారి కోసం గాలించగా వారు పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నగేష్‌ను ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతామని పోలీసులు తెలిపారు. అయితే వివాహేతర సంబంధం కారణంగా దాడి జరిగిందన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. గతంలో ధర్మవరం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సైతం పంచాయతీ చేసినట్లు సమాచారం.

వైభవంగా గరుడోత్సవం



రమణ మహర్షి ఆశ్రమంలో మహా పరిపూర్ణ శాంతి యాగం చేస్తున్న భక్తులు



గరుడ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు, డైరెక్టర్ల సమక్షంలో గరుడ వాహనంపై స్వామివారు ప్రత్యేక అలంకరణలో కొలువుదీరి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గోదా రంగనాథ మహిళా సంఘం సభ్యుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

- పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న రమణ మహర్షి ఆశ్రమంలో పౌర్ణమి సందర్భంగా అరుణాచల శివ నామస్మరణతో భక్తులు రమణ మహర్షికి పూజలు చేశారు. అనంతరం మహా పరిపూర్ణ శాంతి యాగం చేశారు.